క్లుప్తంగా

నవోదయ ప్రవేశ పరీక్షకు 1,359 మంది హాజరు

సంగారెడ్డి: జిల్లాలో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష 12 కేంద్రాలలో నిర్వహించారు. జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సంగారెడ్డి లోని పరీక్ష కేంద్రాలను శనివారం పరిశీలించారు. మొత్తం 2,133 మందికిగాను 1,359 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

ఎంపీ స్థానం గెలుపొందాలి

జహీరాబాద్: కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన జరిపి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. శనివారం కోహీర్, జహీరాబాద్ రూరల్, జహీరాబాద్ టౌన్, మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో పర్యటించి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. సమావేశాలలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, పార్టీ నాయకులు బద్దం మహిపాల్‌రెడ్డి, రవికుమార్‌గౌడ్, ఎస్.జగన్నాథ్, కె.జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

80 మందికి వైద్య పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: రామచంద్రపురం పరిధిలోని వెలమెల తండాలో హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఏషియన్ పెయింట్స్ సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 80 మంది తాండావాసులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు సంస్థ ప్రతినిధి సాంబరాజు తెలిపారు. అవసరమైన వారికి మందులను అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీని ఏర్పాటు చేయాలి

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం, చెట్లపోతారం, అల్లీనగర్ గ్రామాలను కలుపుతూ ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు శనివారం సర్పంచ్ ప్రకాశ్‌చారితో పాటు పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు మాట్లాడుతూ గడ్డపోతారం పంచాయతీ పరిధిలో ప్రస్తుతం గడ్డపోతారం, చెట్లపోతారం, అల్లీనగర్, కిష్టాయిపల్లి, దాచారం గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రభుత్వానికి కూడా విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు పెంటేశ్, సత్యనారాయణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడిని అవమానించారు..

రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు

జహీరాబాద్ టౌన్: విశ్వగురువు బసవేశ్వరుడిని కర్నాటక ప్రభుత్వం సంస్కృతిక నాయకుడిగా ప్రకటించడంపై తెలంగాణ రాష్ట్రీయ బసవదళ్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ 12వ శతాబ్దంలో బసవేశ్వరుడు అనేక సంస్కరణలు తీసుకొచ్చి ఆచరణలో పెట్టారన్నారు. ఇటీవల మహారాష్ట్రలోని షోలాపూర్‌లో ఒక ఊరేగింపులో కొంత మంది బసవన్న చిత్రపటాన్ని తొలగించారన్నారు. ఈ చర్యకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రీయ బసవదళ్ నాయకులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

కోహీర్(జహీరాబాద్): మండల కేంద్రమైన కోహీర్‌లోయువకుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ విఠల్ అందించిన సమాచారం ప్రకారం కోహీర్ పట్టణానికి చెందిన మునీర్‌షా కుమారుడు మహమద్ అఫ్రోజ్(26) గత నెల 22న సమీపంలోని హజ్రత్ సయ్యద్ మౌలానా మొహిజోద్దీన్‌దర్గా వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బంధుమిత్రులు, స్నేహితుల వద్ద వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. తల్లి సలీమాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 87126 56756 నంబరుకు తెలియచేయాలని ఎస్ఐ విఠల్ తెలిపారు.

గీతం విద్యార్థినికి పీహెచ్ డీ

పటాన్‌చెరు: గీతం విశ్వవిద్యాలయంలోని రసాయనశాస్త్ర విభాగం విద్యార్థిని సంధ్యను డాక్టరేట్ వరించింది. పర్యావరణానికి సంబంధించిన అంశాలపై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిందని గైడ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట నాగేంద్రకుమార్ పుట్టా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్(రిటైర్డ్) ప్రొఫెసర్ శ్రీధర్ బొజ్జా బాహ్య పరిశీలకుడిగా వ్యవహరించినట్టు తెలిపారు. పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడంపై విద్యాసంస్థల అదనపు ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తదితరులు సంధ్యను అభినందించారు.

చెత్త వేసిన వ్యక్తికి రూ.2వేలు జరిమానా

సంగారెడ్డి: పట్టణంలో సీఎస్ఐ చర్చ్ వద్ద చెత్తను పారబోసిన ఒకవ్యక్తికి మున్సిపల్ కమిషనర్ సుజాత రూ.2వేలు జరిమానా విధించారు. శనివారం ఆ వ్యక్తి చెత్తను పాతబోస్తుండగా అధికారులు పట్టుకున్నారు. భహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేసినా, తగులబెట్టినా రూ.5వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్ బాబు, జవాన్లు ఉన్నారు.

ట్రాఫిక్ తిప్పలు

- యూటర్న్‌ల వద్ద సమస్యలు
- నిలిచిపోతున్న వాహనాలు
- ప్రమాదాల బారిన వాహనదారులు


యూటర్న్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని జాతీయ రహదారి వాహనదారుల పాలిట శాపంగా తయారైంది. నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. లింగంపల్లి చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. దీనికి తోడు ప్రమాదాలను అరికట్టేందుకు జాతీయ రహదారిపై పలుచోట్ల ఉన్న యూటర్న్‌లను అధికారులు మూసివేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న యూటర్న్ వద్ద వాహనదారులు నరకయాతన పడాల్సిన పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ సమస్యలు పూర్తిస్థాయిలో నియంత్రించడంలో అధికారులు విఫలం చెందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లింగంపల్లి చౌరస్తా నుంచి అశోక్‌నగర్ సమీపంలో ఒకటే యూటర్న్ ఉండడంతో పలువురు వాహనదారులు రాంగ్ రూట్లో ప్రయాణాలు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు.

రాంగ్ రూట్లో ప్రయాణం..

ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారింది. ఆ సమయంలో యూటర్న్‌ల వద్ద వాహనదారులు తమ ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ప్రమాదాలకు దారితీస్తోంది. అలాగే చాలా చోట్ల జాతీయ రహదారిపైనే వాహనాలు నిలిపేస్తున్నారు. యూటర్న్ కోసం చాలా దూరం వెళ్లాల్సి రావడంతో వాహనదారులు రాంగ్ రూట్లో ప్రయాణం సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది రద్దీ సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిస్థాయిలో నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సిబ్బందిని పెంచాలి

యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ సిబ్బంది నిరంతరం విధులు నిర్వహించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. యూటర్న్‌లు ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటే వాహనదారులకు ఎంతో ఉపయోగపడుతుంది.

– బలరాం, రామచంద్రాపురం

పూర్తిస్థాయిలో ట్రాఫిక్ నియంత్రిస్తున్నాం



జాతీయ రహదారిపై పూర్తిస్థాయిలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ యూటర్న్‌లను మూసివేశాం. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పవన్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ


అక్షింతలను తీసుకువెళ్తున్న గ్రామ పెద్దలు


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం ఉదయం రాజోల గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలు, యువకులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు.

నారాయణఖేడ్‌లో.. మండలంలోని అబ్బెంద కింది తండాలో శనివారం అయోధ్య అక్షింతలను రాథోడ్ సేవాలాల్ ఆధ్వర్యంలో భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. ప్రాణప్రతిష్ఠ నిర్వహించే ఈనెల 22న తండాలో పండుగ వాతావరణం నెలకొనేలా ప్రతీఒక్కరూ చూసుకోవాలని కోరారు.

22న రామాలయంలో ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు: అయోధ్యలో శ్రీరామాలయ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీకోదండ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జనవరి 22న ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ చెప్పారు. ఆయన శనివారం జీహెచ్ఎంసీ సిబ్బందితో ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు. అనంతరం అన్నదాన కమిటీతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలు పరిశుభ్రం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): 22న అయోధ్యలో జరగనున్న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం ముస్తాబవుతోంది. ఆలయ పరిసర ప్రాంతాలను జీహెచ్ఎంసీ సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. తెల్లాపూర్‌లో శనివారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. గ్రామస్తులు ఉదయం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్షింతల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

కార్యకర్తల సమష్టి కృషితోనే హ్యాట్రిక్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్యకర్తల సమష్టి కృషితోనే హ్యాట్రిక్ సాధించానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో కౌన్సిలర్ చిట్టి ఉమేశ్ ఆధ్వర్యంలో చిలుకూరు బాలాజీ దేవాలయం వరకు చేపట్టిన పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను విజయం సాధించిన సందర్భంగా కౌన్సిలర్ చిట్టి పాదయాత్ర చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలో నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. కార్యకర్తల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. తన గెలుపునకు కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని ఆయన వివరించారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్లెపల్లి లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు ఉమేశ్, రమేశ్, బూరుగడ్డ నగేశ్, నరసింహ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 16న అఖిల భారత సమ్మె

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని చందాపూర్ గ్రామ శివారులో గల పెన్నార్ పరిశ్రమలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను కేంద్ర ప్రభుత్వం దోచుకుంటుదన్నారు. పెట్టుబడుదారులు, కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ వారికి లాభం చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. దానికి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం, అఖిలభారత కిసాన్సభ సంయుక్తంగా దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. కార్మికులు, రైతులు, విద్యార్థులు, మేధావులంతా సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మోహన్ చారి, జి.శ్రీనివాస్, నీలం మల్లేశం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంకర క్రషర్‌లలో అధికారుల తనిఖీలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి పరిధిలోని కంకర క్రషర్‌లలో శనివారం అధికారులు పర్యటించారు. మైనింగ్‌శాఖ ఏడీ మధుకుమార్, జిన్నారం తహసీల్దార్ రవికుమార్, మైనింగ్ ఆర్ఐ సైదులు, ఆర్ఐ జయశంకర్‌నారాయణ, సర్వేయర్ రామభద్ర కలిసి 144 సర్వేనంబర్‌లో గల కంకర క్రషర్‌లను పరిశీలించారు. క్రషర్‌ల యాజమానుల వద్ద ఉన్న అనుమతులను తనిఖీ చేశారు. క్రషర్‌లకు కేటాయించిన స్థలాలపై పూర్తి స్థాయి సర్వేచేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో శనివారం జేసీ మాధురి పర్యటించారు. ఓ ప్రైవేటు వెంచర్ ఏర్పాటుకు అనుమతులు కోరడంతో ఆ భూములను ఆమె పరిశీలించారు. ఓటు నమోదుపై అధికారులు తీసుకుంటున్న చర్యలపై జేసీ ఆరా తీసినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

చేనేత కార్మిక సెల్ జిల్లా కార్యదర్శిగా రవికుమార్

సదాశివపేట(సంగారెడ్డి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేనేత విభాగం సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సదాశివపేట 6వ వార్డు కౌన్సిలర్ గుండు రవికుమార్ నియామకమయ్యారు. శనివారం ఆయనకు జిల్లా చైర్మన్ ప్రవీణ్ బాలే నియామక పత్రం అందజేశారు. రవికుమార్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన

ఎన్నికల ఉప తహసీల్దార్ సంతోష్ కుమార్


ఓటర్ నమోదు క్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీవో


ఉపన్యాస పోటీల్లో మాట్లాడుతున్న విద్యార్థిని

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. హత్నూర, దౌల్తాబాద్, సాదులనగర్ తదితర గ్రామాలలోని ఓటరు నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించి బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు, రెండు రోజులపాటు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులో దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివారం కూడా ప్రతి గ్రామంలో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులు నిర్వహిస్తారన్నారు.

ప్రత్యేక శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ఝరాసంగం(జహీరాబాద్): ఓటు హక్కు నమోదుకు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సంజీవరావు సూచించారు. శనివారం మండలంలోవివిధ గ్రామాల్లో ఓటు హక్కు నమోదుపై ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. కుప్పానగర్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో ఆయన పాల్గొని పలు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు లక్ష్మీబాయి, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదుకు మరో అవకాశం

పటాన్‌చెరు టౌన్: ఓటర్ నమోదు చేసుకునేందుకు యువతకు మరో అవకాశం లభించిందని, జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని ఎన్నికల ఉప తహసీల్దార్ సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'భారత ప్రజాస్వామ్య ఎన్నికల్లో యువత పాత్ర' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంతోష్ మాట్లాడుతూ 21, 22న రెండు రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కార్తీక్ మాస్టర్ ట్రైనర్ అమరేందర్‌రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, నోడల్ ఆఫీసర్ నాగరత్నమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి

కల్హేర్(నారాయణఖేడ్): ఓటర్ ప్రక్రియను సక్రమంగా నమోదు చేయాలని నారాయణఖేడ్ ఆర్డీఓ వెంకటేశ్ బీఎల్‌ఓలకు సూచించారు. శనివారం మండలంలోని కృష్ణాపూర్‌లో ఓటర్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. 18 ఏళ్లు పూర్తయిన వారందరి ఓటుహక్కును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలశంకర్, సర్పంచ్ కిష్టారెడ్డి, ఆర్ఐ మల్లేశం, నాయకులు తుకారం తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు సాధించడంలో విఫలం

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్ర విభజన హామీలు– కేంద్ర ప్రభుత్వ వివక్షపై రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను తెలంగాణ జన సమితి సమన్వయ కర్త శ్రీధర్ మహీంద్ర ఆవిష్కరించారు. కొండాపూర్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్ళు అవుతున్నా.. కేంద్రం ద్వారా విభజన హామీలు అమలు చేయించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉద్యోగుల విభజన పూర్తిచేసి తెలంగాణ ఉద్యోగులను వెనక్కి పంపాలని, పెండింగ్‌లో ఉన్న రాష్ట్రస్థాయి సంస్థలను, ఆస్తులను విభజించాలని డిమాండ్ చేశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని, ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని తక్షణమే ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సుకు మేధావులు, యువత హాజరై జయప్రదం చేయాలని కోరారు. జన సమితి నాయకులు పాండు, మల్లేశ్, వెంకటేశం, డాకయ్య, మల్లేశం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కార్పొరేటర్ పుష్పనగేశ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేశ్ సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మండల విద్యాధికారి రాథోడ్ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతోందన్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నారని, దీంతో పాఠశాలలకు మంచి డిమాండ్ పెరిగిందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె ఉపాధ్యాయులను కోరారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..

కోహీర్(జహీరాబాద్): పదోతరగతిలో సత్ఫలితాలు సాధించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దిగ్వాల్ ప్రభుత్వోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాకీర్ హుసేన్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. శనివారం పాఠశాలలో ప్రత్యేకంగా నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రగతికి కృషి చేయాలన్నారు. 29న నిర్వహించే పాఠశాల విద్య కమిటీ ఎన్నికల్లో విధిగా పాల్గొనాలని ఆయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నర్సింలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

హత్నూర (సంగారెడ్డి): సిరిపురం గ్రామానికి చెందిన రెండు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సునీత పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న గంగారం విట్టల్ రెడ్డి, మమ్మద్ ఫయాజ్‌ను ఆమె శనివారం పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆమెతో పాటు సీడీసీ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరేందర్, నాయకులు నాగేశ్‌గౌడ్, నరోత్తంరెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా కృత్తికా నక్షత్ర వేడుకలు

సంగారెడ్డి టౌన్: పట్టణ శివారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కృత్తికా నక్షత్ర వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, మహాపూజ కార్యక్రమాలుత నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

◆ పేదలకు దుప్పట్ల పంపిణీ

సదాశివపేట(సంగారెడ్డి): టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, 1993– 94 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, హెచ్ఎం పోల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో చలి తీవ్రతతో ఇబ్బంది పడుతున్న పేదలకు శుక్రవారం రాత్రి దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాండురంగారెడ్డి, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

◆ ఓటుహక్కుపై వ్యాస రచన పోటీలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం 'ఓటు హక్కు–దాని విలువ' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఓటు ప్రాముఖ్యత గురించి వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు పేరును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: గౌడ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎస్ఐ అంజిగౌడ్ ఆవిష్కరించారు. పట్టణంలోని అతిథి హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గౌడ్ కులస్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మాణయ్యగౌడ్, అంజయ్యగౌడ్, తుకారాం గౌడ్, విఠల్‌గౌడ్, నర్సింలు గౌడ్, పరుశరాం గౌడ్, తుల్జరాం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా విగ్రహాల ఊరేగింపు

మరనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల పరిధిలోని మోర్గిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా శ్రీరాముడు, పాండురంగ విగ్రహాలను శనివారం ఘనంగా ఊరేగించారు. స్థానిక హనుమాన్ మందిరం నుంచి నూతన ఆలయం వరకు కలశలతో ఊరేగించి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ గణిత టాలెంట్ పరీక్ష

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శనివారం పదో తరగతి విద్యార్థులకు గణిత టాలెంట్ పరీక్ష నిర్వహించామని ఎంఈవో అంజయ్య తెలిపారు. 10 పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు పరీక్ష రాశారని చెప్పారు. ప్రతిభను చాటిన విద్యార్థులకు 23న జిల్లా స్థాయి గణిత టాలెంట్ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింలు, బాలరాజు, తాజుద్దీన్, సీఆర్పీ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కల్హేర్‌లో..

కల్హేర్ జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం మండల స్థాయి గణితం టాలెంట్ టెస్టు నిర్వహించారు. కల్హేర్, మాసాన్‌పల్లి, మార్డి, బీబీపేట ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం శైలజకులకర్ణి, టీచర్లు మోహన్, సంజీవ్‌కుమార్, మురళిగౌడ్, బాలరాజు, మశ్చేందర్, నవీన్ పాల్గొన్నారు.

◆ కొల్లూర్ పోలీసులకు సేవా పతకాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ముగ్గురు అధికారులకు ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. వారికి శుక్రవారం సైబరాబాద్ సీపీ మహంతి అవార్డును అందజేశారు. ఏఎస్ఐలు డి.దేవేందర్, యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డిని కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ అభినందించారు.

◆ మద్యం పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ లేబర్ క్యాంపులో బెల్ట్ దుకాణంపై శనివారం సాయంత్రం కొల్లూర్ పోలీసులు దాడిచేసి 13.5 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు.

◆ పంటల సాగు నమోదు తనిఖీ

జహీరాబాద్: మండలంలోని చిన్న హైదరాబాద్ గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు పర్యటించి పంట సాగు వివరాల నమోదును తనిఖీ చేశారు. శనివారం పంట పొలాల్లో ఆయన పర్యటించారు. సర్వే నెంబర్ల వారిగా ఏయే పొలంలో ఏయే రకాల పంటలు సాగులో ఉన్నాయనేది పరిశీలించారు. అనంతరం సుభాస్ గంజ్‌లోని ఎరువుల దుకాణాలను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ సీఎం చిత్రపటాలను పెట్టాలని వినతి

పటాన్‌చెరు: ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలను పెట్టాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ప్రిన్సిపల్ సెక్రెటరీని శనివారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఫొటోలు కనిపించడం ఆశ్చర్యకరమైన విషయమన్నారు.

◆ రిటైర్డు ఉద్యోగి ఔదార్యం

కల్హేర్(నారాయణఖేడ్): రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి మొగిలి రాంగోండ చిన్నప్పుడు పుట్టి పెరిగిన స్వగ్రామం సిర్గాపూర్ మండలం ముబారక్‌పూర్ ప్రాథమిక పాఠశాలకు తమ వంతు సహాయం చేశారు. మధ్యాహ్న భోజన వసతి కోసం గ్యాస్ సిలిండర్‌ను అందజేశారు. సర్పంచ్ స్వప్న మధు, హెచ్ఎం మల్లేశం రాంగోండను అభినందించారు.

◆ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కల్హేర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అసద్ ఫారుఖ్ బమహెది కోరారు. కళాశాలలో శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు విడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది సైదులు, రాజేశ్, ఉమపతి, మాధవి పాల్గొన్నారు.

◆ 22న నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: హరేరామ హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మందిరాల వద్ద శ్రమదానం నిర్వహిస్తున్నారు. స్వచ్ఛత అభియాన్‌లో భాగంగా పట్టణంలోని శాంతినగర్ హనుమాన్ మందిరం, సంతోషిమాత మందిరం, రామ మందిరం, దత్తగిరి కాలనీ పంచముఖి హనుమాన్ ఆలయాలలో వారం రోజుల నుంచి పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ అయోధ్యలో రామచంద్రుడి ప్రాణపతిష్ఠలో భాగంగా 22న నగర సంకీర్తన నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

◆ పాఠశాలల్లో ఎన్నికల సందడి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల సందడి నెలకొంది. 29న నిర్వహించనున్న ఆ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ శనివారం విడుదలైంది. దానిని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు నోటీస్ బోర్డులపై అతికించారు.